
బగళనత్తంలో..



ఎస్.గొల్లపల్లె పెద్దచెరువు వద్ద..



ఇటు చిరుజల్లు.. అటు హరివిల్లు

రామకుప్పం మండలంలో ఆదివారం ఉషోదయాన ఆనందకర వాతావరణం వెల్లివిరిసింది. తెల్లవారుజామున ఆకాశాన నల్లటి మబ్బులు అలుముకున్నాయి. కాసేపటికి చిరుజల్లులు సందడి చేశాయి. సన్నటి చలిగాలులు వీచి ఆహ్లాదాన్ని పంచాయి. తెలతెలవారుతుండగా ఉదయ భానుడు తొంగిచూస్తున్న వేళ గగనాన విరిసిన హరివిల్లులు అందరిలో ఆనందాన్ని నింపాయి. తర్వాత మేఘాలన్నీ నిష్క్రమించాయి. ఆకాశం ఎప్పటిలా నిర్మలంగా మారిపోయింది. బగళనత్తం పొలిమేర, ఎస్.గొల్లపల్లె పెద్ద చెరువుల వద్ద మెరిసిన హరివిల్లులను చూసి ప్రజలు ఆనందానుభూతిని పొందారు.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

హమ్మయ్య.. కాపాడారు..!



కీళపట్టు సమీపాన ఉన్న వంతెనపై నీటి ప్రవాహం

● కుశస్థలీ నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన కీళపట్టు యువత



నదిలో కొట్టుకుపోతున్న త్యాగరాజ ఆచారిని కాపాడుతున్న యువత

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తడంతో కుశస్థలీ నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ఈ నదిపై నగరి-తిరుత్తణి మార్గం లోని కీళపట్టు సమీపాన ఉన్న వంతెన పైకి ఆదివారం నీరు ప్రవహించడంతో రాకపోకలకు జనం ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం కీళపట్టులో ఆవు కాలికి లాడం కొట్టడానికి అడవికొత్తూరు నుంచి వచ్చిన త్యాగరాజ ఆచారి ఈ వంతెనపై నీటి ప్రవాహాన్ని అంచనా వేయలేక నడిచి వెళుతుండగా కొట్టుకపోయాడు. గమనించిన కీళపట్టుకు చెందిన యువకులు అతడిని తాడు సాయంతో కాపాడి, బయటకు తీసుకొచ్చారు.

- నగరి, ఆంధ్రజ్యోతి

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. జిల్లాస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి

● ఆరుగురికి గాయాలు



విశ్వనాథరెడ్డి (ఫైల్ ఫొటో)

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో తేనెటీగల దాడిలో ఓ రైతు మృతి చెందాడు. ఆరుగురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గుండిశెట్టిపల్లె సమీపంలోని ఓ మామిడి తోటలో ఆదివారం మధ్యాహ్నం రైతు విశ్వనాథరెడ్డితో మరికొందరు మునిదేవర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో వారిపై తేనెటీగలు దాడిచేశాయి. ఈ దాడిలో విశ్వనాథరెడ్డి తీవ్రంగా గాయపడగా, ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. విశ్వనాథరెడ్డిని బంధువులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. గాయపడ్డ వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కు మొండి బకాయిల సెగ తప్పడం లేదు. ఆప్కాబ్ నుంచి తెచ్చిన రుణాలను డీసీసీబీ కింద ఉన్న ప్రాథమిక సహకార పరపతి సంఘాల(సింగిల్ విండోల) ద్వారా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలుగా ఇస్తుంది. వీటిని సింగిల్ విండోలు, సిబ్బంది కలిసి సకాలంలో వసూలు చేసి డీసీసీబీకి జమచేయాలి. అయితే సింగిల్‌విండోల్లోని పాలకవర్గాలు బినామీ రైతుల పేరిట వారే భారీగా రుణాలు వాడేశారు. దీనివల్ల రూ.102 కోట్ల వరకు మొండి బకాయిలు పెరిగిపోయాయి.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



● రూ.102 కోట్ల వసూలుకు డీసీసీబీ చర్యలు

మొండి బకాయిలపై దండన మంత్రం

డీసీసీబీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.137 కోట్ల మేర పంపిణీ చేసిన వ్యవసాయ రుణాల్లో ఇప్పటివరకు రూ.35 కోట్లను మాత్రమే వసూలు చేశారు. ఏళ్ల తరబడి రూ.102 కోట్లు వసూలు కాలేదు. రుణగ్రహీతల జాబితాలోని 280 మందిలో సుమారు 30 మంది రూ.40 కోట్లు చెల్లించాల్సిఉంది. అప్పటి ప్రభుత్వం అమూల్ సంస్థ కోసం పాడిరుణాల పేరిట వెయ్యి మందికి రూ.12కోట్లను అందజేశారు. ఇందులో అతికష్టంపై రూ.6 కోట్లు వసూలు చేయగా, మరో 650 మంది నుంచి ఇంకా రూ.6 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

పథకాలకు లంకెపెట్టి

ప్రభుత్వ పథకాల అమలుకు డీసీసీబీకి లంకె పెడుతున్నారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యంత్ర పరికరాలపై లబ్ధిదారులకు రాయితీపై రుణాలు మంజూరు చేశారు. 250 గ్రూపులకు సంబంధించి 866 మంది డీసీసీబీ నుంచి తీసుకున్న రుణాల్లో రూ.4కోట్ల వరకు బకాయిలున్నాయి.

చట్టపరమైన చర్యలకు సిద్ధం

చాలామంది వ్యవసాయ రుణాలను సొంత వ్యాపారాలు,ఇతర అవసరాలకు వినియోగించుకున్నారు. వాయిదాలు చెల్లించమంటే రాజకీయ అండతో ఎదురుతిరుగుతున్నారు.ఏళ్లు గడుస్తున్నా..వడ్డీ పెరుగుతున్నా.. రుణం రెట్టింపైనా.. వారిలో ఏ మాత్రం స్పందన లేదు. కొంద రైతే దౌర్జన్యానికి సైతం వెనుకాడడం లేదు. అలాంటివారిపై చట్టపరమైన చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు.

రికవరీ బృందాల ఏర్పాటు

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖర్‌రెడ్డిని నియమించాక రుణ వసూళ్లపై దృష్టి పెట్టారు. రైతుల కోసం ఏర్పాటు చేసుకున్న బ్యాంకు దుస్థితిని నేతలకు వివరించి సహకరించాలని కోరారు. ఏజీఎం, చీఫ్ మేనేజర్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో డీసీసీబీ బ్రాంచ్‌ల్లో పనిచేస్తున్న సిబ్బంది, సూపర్‌వైజర్లు, సింగిల్‌విండో ఉద్యోగులతో బృందాలు ఏర్పాటు చేసి, రికవరీ మొదలుపెట్టారు.

మొండి బకాయిలు వసూలు చేస్తాం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సకాలంలో రుణాలు చెల్లించక.. నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ)గా గుర్తించిన రూ.102 కోట్ల వసూలుకు నోటీసులిచ్చాం. రికవరీ బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

- సి.శంకర్ బాబు, డీసీసీబీ సీఈవో, చిత్తూరు



పోలింగ్‌కి ముందు రూ.20 కోట్ల రుణాలు

2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందుగా పుంగనూరు, బైరెడ్డిపల్లె, పలమనేరు, వి.కోట, మదనపల్లె డీసీసీబీ బ్రాంచుల ద్వారా పంట రుణాల పేరిట రూ.20 కోట్లు మంజూరు చేశారు. అక్కడి రైతుల భూమిని బ్రాంచ్ మేనేజర్లు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వాలి. అలాకాకుండా అప్పటి వైసీపీ నేతల సిఫారసు మేరకు ఇష్టానుసారం రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలన్నీ వైసీపీ శ్రేణులకే చేరినట్లు ఆరోపణలున్నాయి.

160మందికి ఒకే రోజున సీఎంఆర్‌ఎఫ్ పంపిణీ

రూ.1,32,34,595 చెక్కులను అందజేసిన నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేదల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) మారిందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన 160 మందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.1,32,34,595 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అంటే ఏమిటో తెలియని స్థితిలో ఉండేదన్నారు. సీఎంగా చంద్రబాబు వచ్చాక అందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చులకు బిల్లులను చెక్కుల రూపంలో చెల్లిస్తున్నట్లు చెప్పారు. నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజి మాట్లాడుతూ.. 2009లో ముద్దుకృష్ణమనాయుడు సీఎం సహాయనిధి ద్వారా వైద్యసేవలకు అయ్యే ఖర్చుల నిమిత్తం పేదలకు చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా భానుప్రకాష్ కూడా అదేబాటలో నడవడం ఆనందంగా ఉందన్నారు. నగరి పట్టణ టీడీపీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2020లో తన తండ్రి వైద్యం కోసం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి సాయం అందలేదన్నారు. ఐదేళ్ల తర్వాత ఇపుడు తనకు కూడా సాయం అందడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పుత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, మండల అధ్యక్షులు అరవ బాలాజి, ధనంజయనాయుడు, రమేష్‌రాజు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టి తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలోని కొందరు మద్యం దుకాణదారులు, భూదందాలు చేసిన వారు పైరవీల కోసం నావద్దకు వచ్చారు. వారిని నిర్మొహమాటంగా తిరిగి పంపించేశా. ఇలా ఏడాది పాటు నా వద్దకొచ్చిన వ్యవహారాలను తిప్పికొట్టా. ఇలాంటి అంశాల్లో గతంలో రోజా రూ.కోట్లు సంపాదించారు. నేను అవినీతి అక్రమాలకు తావివ్వను. ఎవరైనా నా పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించను.

- ఎమ్మెల్యే భానుప్రకాష్

ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట



పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని కమ్మపల్లె పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లె వద్ద శనివారం రాత్రి పంటలపై ఏనుగుల మంద దాడులు చేయడంతో వరి, వేరుశనగ పంటలకు అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయల్దేరిన ఆరు ఏనుగుల మంద బాలిరెడ్డిగారిపల్లె వద్దకు చేరుకున్నాయి. ప్రవీణ్ కుమార్, రుక్మణమ్మ, చెంగయ్య, సురేంద్రరెడ్డి, హైమావతికి చెందిన వరి పంటలను ధ్వంసం చేశాయి. వేరుశనగ పంటను తొక్కేశాయి. మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి, పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడి నుంచి సమీపంలోని ఎస్టీ కాలనీ వద్దకు చేరుకున్న ఏనుగులు ఘీంకారం చేశాయి. దాంతో గ్రామంలోని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడినుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగుల మంద మార్గంలోని కలబందను తింటూ.. పలువురు రైతుల మామిడిచెట్లను ధ్వంసం చేస్తూ అడవిలోకి చేరుకున్నాయి. ఆదివారం పగలంతా చింతలవంక, సూరప్పచెరువు సమీపంలో ఎనుగులు తిష్ఠ వేసినట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

గట్టువారిపల్లె సమీపంలో ఒంటరి ఏనుగు

సోమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ గట్టువారిపల్లె సమీప పొలాల్లో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు సంచరించినట్లు రైతులు తెలిపారు. మూడ్రోజుల కిందట నాలుగు ఏనుగులు చెరుకువారిపల్లె అటవీ ప్రాంతం నుంచి వచ్చాయి. రైతులు గుర్తించి పొలాల వద్ద డప్పులు వాయించి, టపాసులు పేల్చి.. ఐరాల అడవివైపు మళ్లించారు. వాటిలో ఒంటరి ఏనుగు మళ్లీ గట్టువారిపల్లె, గురికానివారిపల్లె ప్రాంతంలోని వరి పొలంలో సంచరించినట్లు రైతులు తెలిపారు.

పశ్చిమ అటవీ ప్రాంతంలో మరిన్ని ఏనుగులు

పులిచెర్ల మండలానికి పశ్చిమ విభాగంలో ఉన్న అటవీ ప్రాంతాల్లో సుమారు 10 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పాకాల మండలం పుల్లావాండ్లపల్లె సమీపంలోని అడవిలో నాలుగు ఏనుగుల మంద, మరో ఆరు ఏనుగుల మంద సోమల మండలం నంజంపేట సమీపంలోని అడవిలో తిష్ఠ వేశాయి. సమీపంలోని పంటలను ధ్వంసం చేస్తున్నాయి.

రెండు బైకుల ఢీ

● ఇద్దరు యువకుల దుర్మరణం
● ఒకరికి గాయాలు

నేడు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ

● కలెక్టర్ సుమిత్ కుమార్

- వివరాలు 5వ పేజీలో -

శాంతిపురంలో 86.4 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 18 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శాంతిపురం మండలంలో అత్యధికంగా 86.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. వి.కోటలో 38, రామకుప్పంలో 24.8, సదుంలో 20.6, రొంపిచెర్లలో 17.8, కుప్పంలో 12, గుడుపల్లెలో 10.4, విజయపురంలో 10.2, చిత్తూరు అర్బన్‌లో 4.2, కార్వేటినగరంలో 3.4, పెనుమూరు, పుంగనూరు, నింద్రలో 3.2, బంగారుపాళ్యంలో 3, నగరిలో 2.2, పెద్దపంజాణిలో 2, గంగవరంలో 1.8, గుడిపాలలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

నలుగురు రైల్వే ఉద్యోగుల సస్పెన్షన్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పాకాల-పూతలపట్టు రైలు మార్గంలో ఇటీవల మరమ్మతులు చేస్తుండగా ఓహెచ్ఈ కార్ పట్టాలు తప్పిన ఘటనలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగం జేఈ ఉదయభాను, మేస్త్రీ సన్యాసరావు, గ్యాంగ్‌మెన్ షణ్ముగంతో పాటు ఓహెచ్ఈ కార్ డ్రైవర్‌ను ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జలాశయం నుంచి 350 క్యూసెక్కుల నీటి విడుదల

పెనుమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం నుంచి ఆదివారం ద్వారా 350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం కురిసిన వర్షానికి జలాశయానికి భారీ ఎత్తున నీరు చేరడంతో రెండు గేట్లు తెరిచినట్లు ఇరిగేషన్ ఏఈ భరత్ తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గురుతేజం జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



పెద్దపంజాణి ఎంపీడీవో బాలాజీని సన్మానిస్తున్న సీఐ నిత్యబాబు, ఇతర ప్రముఖులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఉషోదయ ఫౌండేషన్, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుతేజం జీవిత సాఫల్య పురస్కారాన్ని పలువురికి ప్రదానం చేశారు. సాహితీ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్న ప్రముఖ రచయిత, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీకి ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ధనాసి ఉషారాణి, శ్రీధర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు ఈ పురస్కారాన్ని అందజేసి, సన్మానించారు. కథ, కవిత, నవల, విమర్శ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ సాయిలో అనేక పురస్కారాలు పొందిన పలమనేరు బాలాజీ నాలుగు కథా సంపుటాలను, మూడు కవితా సంపుటాలను, నవలను వెలువరించారు. సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలమనేరు బాలాజీకి పలువురు అభినందనలు తెలిపారు.

కార్మికుల పక్షాన టీడీపీ: గౌనివారి

రామకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి కార్మికుల పక్షాన నిలుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బాటలోనే సీఎం చంద్రబాబు పయనిస్తూ కార్మికులకు అండగా నిలుస్తున్నారన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున రూ.435 కోట్లు అందజేసిందన్నారు. జగన్ తన పాలనలో అరకొర సాయం అందించి డీజిల్, పెట్రోలు ధరలు అమాంతం పెంచి ఆటోడ్రైవర్ల జేబులకు చిల్లుపెట్టారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10 వేలు అందిస్తే తమ ప్రభుత్వం రూ.15 వేలు ఇచ్చిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రూ.1400 కోట్లు వెచ్చించి రహదారులకు మరమ్మతులు చేయించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుండటంతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారని ఆయన తెలిపారు.

విమలకు స్వచ్ఛాంధ్ర అవార్డు



రామకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె అంగన్‌వాడీ కార్యకర్త విమల జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో ఆమె అవార్డును అందుకోనున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

రామకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం యాలకల్లుకు చెందిన షాహీన్ రామకుప్పం నుంచి వి.కోట మండలానికి ఆదివారం అక్రమంగా మద్యం తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులు.. సమాజ నిర్మాతలు



పుంగనూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు



గంగవరం: సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్దేశకులు.. ఉపాధ్యాయులేనని పుంగనూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు నాన బాల గణేష్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉపాధ్యాయ వృత్తితోపాటు సమాజసేవలో పాల్గొనే చంద్రకళ, రాజకుమారి, అయూబ్, అనిల్‌కుమార్, మోహన్‌కుమార్‌యాదవ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి సీఎస్ రాజారెడ్డి, ప్రతినిధులు డాక్టర్లు ప్రభాకర్, శరణ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌జెట్టి, అనిల్‌కుమార్, మునిరాజ, ఆవుల హరిప్రసాద్, సురేశ్, సత్యాచారి, వేణుగోపాల్, రవికిషోర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు

● **గంగవరం:** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కళామందిరంలో జిల్లాలో వివిధ ప్రదేశాల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించారు. విద్యారంగంలో సేవలందిస్తున్న పి.లత (కీలపట్ల), తేజస్వి(పలమనేరు), రాఘవనాయుడు(ఎస్.ఆర్.పురం), చంద్రశేఖర్‌రెడ్డి (నెల్లిపట్ల), సాధనకుమార్ (పుల్లూరు), శశికుమార్ (బైరెడ్డిపల్లె), రాజేంద్ర (శ్రీరంగరాజపురం), రమేష్(కలగటూరు), కృష్ణమోహన్(కొత్తపల్లె) తదితర ఉపాధ్యాయులను సత్కరించి ఉత్తమ పురస్కారాలను ప్రదానం చేశారు. సంగీత కచేరి నిర్వహించారు. ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు తులసీనాధం నాయుడు, పుష్ప, పలమనేరు బాలాజీ, శ్రీధర్, నరేంద్ర, శీతారామయ్య, శివ, జ్ఞానేశ్వర్, ధనంజయ, విజయ్, ఉమామహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న మదనపల్లె జిల్లా సాధన సమితి నాయకులు

పుంగనూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మదనపల్లెను జిల్లాకేంద్రంగా ప్రకటిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని మదనపల్లె జిల్లా సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ ప్రజాభవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మదనపల్లెను జిల్లాగా ప్రకటించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి 16 నెలలు గడుస్తున్నా ఉపసంఘం మదనపల్లెకి రాలేదన్నారు. ప్రజలను నమ్మించడానికే ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినా ప్రయోజనం లేదన్నారు. మదనపల్లె ను జిల్లా చేయడానికి పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి అనంతరం ఈనెల 26న మదనపల్లెలో మహాసభ నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. మహాసభ విజయవంతం చేయడానికి ప్రజా సంఘాలు, మేధావులు, రాజకీయ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర బహుజనసేన అధ్యక్షుడు చందు, రాష్ట్ర మాలమహానాడు కార్యదర్శి అశోక్‌కుమార్, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, వెంకట్‌యాదవ్, బీఎస్పీ నేత సురేశ్, రెడ్డెప్ప, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అయూబ్, మహిళాధ్యక్షురాలు సమీనా, గంగరాజు, ఆంజప్ప, ప్రతిభ, షబానా, అద్దాల నాగరాజ, రామాంజులు, రమణారెడ్డి పాల్గొన్నారు.

మానవత సంస్థ అధ్యక్షుడిగా నారాయణరెడ్డి

పుంగనూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన అధ్యక్షుడిగా ఏసీ నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పుంగనూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా ఏసీ నారాయణరెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ ప్రభాకర్, కోశాధికారిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సరస్వతి, చైర్మన్‌గా నందీశ్వరయ్య, కో-చైర్మన్‌గా గణేశ్, కన్వీనర్‌గా త్యాగరాజు, సహాయ కార్యదర్శిగా హరినాథరెడ్డి, కార్యవర్గసభ్యులుగా డాక్టర్లు విజయకుమారి, శరణ్‌కుమార్‌రెడ్డి, పి.శివ, వనిత, కమలమ్మ, ద్వారకమ్మ, జగన్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీపీఎస్‌కు మరింత బాధ్యతలు



సమావేశానికి హాజరైన పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు

పలమనేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లాలో ఉత్తమ ఎన్జీవోగా ఎంపిక కావడంతో పలమనేరు పరిరక్షణ సమితికి మరింత బాధ్యతలు పెరిగాయని సమితి అధ్యక్షులు నరసింహులు అన్నారు. జిల్లా కలెక్టరు చేతుల మీదుగా ఈనెల 6న సోమవారం అవార్డు అందుకుంటున్న సందర్భంగా ఆదివారం పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు సమావేశం నిర్వహించారు. పలమనేరులో ఇప్పటి వరకు నిర్వహిస్తూ వచ్చిన సామాజిక కార్యక్రమాలను మరింతగా నిర్వహించడానికి ఈ అవార్డు తమకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని నరసింహులు తెలిపారు. సమావేశంలో పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు సుబ్రహ్మణ్యంపిళ్లై, నారాయణ, ఎన్జీవో సంఘ నాయకులు ఆనందబాబు, శ్రీపురం సీతారామయ్య, విజయకుమార్, పొన్నుడి, రామచంద్ర, సన్నిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు



సోమలలో విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళం అందజేసినట్లు కమిటీ అధ్యక్షులు ఎస్.మునివెంకటప్ప తెలిపారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యాచరణపై సభ్యులు సమీక్షించారు. ఈక్రమంలోనే కరకమందకు చెందిన ఉద్దండయ్యగారి సాంబశివయ్య రూ.50 వేలు, సూరయ్యగారిపల్లెకు చెందిన ఉపాధ్యాయ దంపతులు అమృత, జీసీకే. ప్రసాద్ రూ.50 వేలు అందజేశారు. సమావేశంలో సీఎం.సురేశ్, మదన్‌మోహన్‌బాబు, నగేశ్, శ్రీరాములు, జ్యోతీశ్వరుడు, డాక్టర్ హరినారాయణ, రఘు, శివరామయ్య, వీవీ. రమణ, ఎస్వీ రమణ, సీజీ.రెడ్డెప్ప, సదాశివయ్య, మౌళి, జగన్‌మోహన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత న్యాయం



రొంపిచెర్లలో పర్యటిస్తున్న మంత్రి సవిత

రొంపిచెర్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వంలోనే బీసీ వర్గాల వారికి సముచిత న్యాయం జరిగిందని రాష్ట్ర బీసీ, శిశుసంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. కురబలకు రాజకీయంగా స్థానం కల్పించారన్నారు. తిరుపతిలో ఆదివారం జరిగిన భక్త కనకదాస్ విగ్రహ ఆవిష్కరణకు అనంతపురం జిల్లా పెనుగొండ నుంచి పలు వాహనాలో తిరుపతికి వస్తున్న కురబ, టీడీపీ కార్యకర్తలు, నాయకులకు రొంపిచెర్ల మండల పెద్దగొట్టిగల్లు సమీపంలోని రొంపిచెర్ల మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి సబితను శాలువ, పూలమాలలతో సత్కరించారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, బీసీ నాయకుడు అమరనాథ్, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, టీడీపీ నాయకులు ఓబులేశ్వరరెడ్డి, రవికుమార్ నాయుడు, రామమూర్తి, షేక్ కరీముల్లా, మదనమోహన్ గౌడ, కిరణ్, నాగరాజ, శశికుమార్, చెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** తిరుపతిలో ఆదివారం జరిగిన కనకదాసు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బైరెడ్డిపల్లె నుంచి కురబ సంఘం నాయకులు తరలివెళ్లారు. కురబ సంఘం నాయకులు శివకుమార్, గౌరప్పగౌడు, సుబ్రహ్మణ్యంగౌడు, శేషగౌడు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో పీఈఎస్ వైద్యులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 11 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ప్రతినెలా గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేస్తున్న మహతి ఫౌండేషన్ వారికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

63 మందికి నేత్ర పరీక్షలు

పలమనేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్‌క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్రచికిత్సా శిబిరంలో 63 మందికి నేత్రపరీక్షలు నిర్వహించి అందులో 34 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. చెన్నై శంకర నేత్రాలయ నేత్ర వైద్యులు మురళీ నేత్రపరీక్షలు చేపట్టారు. ఆపరేషన్లు చేసుకొనే వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని, చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని నేత్రవైద్యులు మురళీ తెలిపారు.

నీవా నగరవనంలో భద్రత కరువు

పటిష్ఠ చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



ఎలాంటి భద్రత లేని నీవా నగరవనం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మురకంబట్టు సమీపంలోని నీవా నగరవనంలో భద్రత కరువైంది. ఇక్కడ ఇటీవల బాలికపై జరిగిన అత్యాచార ఘటనే దీనికి నిదర్శంగా నిలుస్తోంది. అటవీశాఖలో సిబ్బంది కొరత, నిఘా వైఫల్యం కారణంగా నగరవనంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయన్న విమర్శలున్నాయి. అటవీశాఖ అధికారుల తెలిపిన వివరాల మేరకు.. నీవా నగరవనానికి సెలవు, పండుగ రోజుల్లో 500 నుంచి 600 మంది వస్తారన్నారు. సిబ్బంది కొరత కారణంగా కేవలం ఒకరు లేక ఇద్దరు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తుంటారన్నారు. సాధారణ రోజుల్లో కేవలం ఒక్కరితోనే నెట్టుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. నగరవనం గుట్ట ప్రాంతానికి అనుకుని ఉండటం, ఎలాంటి కంచె, ప్రహరీ లేకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రేమ జంటల విహారానికి అనువైన ప్రదేశంగా మారింది. మరోవైపు అడవి జంతువుల నుంచి ప్రమాదంతోపాటు పక్కనే డాబాలు ఉండటంతో యువకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో చీకటి పడితే కుటుంబాలతో ఎవ్వరూ ఇక్కడకు రావడం లేదు. వీటన్నింటినీ ఆసరాగా తీసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ఇకనైనా నీవా నగరవనంలో ఎటువంటి దారుణాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ముఖద్వారం

భద్రత, సౌకర్యాలపై దృష్టి



నీవా నగరవనం భద్రత, సౌకర్యాలపై దృష్టి సారించాం. ప్రస్తుతం ఇద్దరు సిబ్బంది ఉండగా, మరో ఇద్దరిని కేటాయించాం. చుట్టూ 550 మీటర్ల చైన్ లింక్ మెష్ ఫెన్సింగ్ వేయడానికి ఆమోదం లభించింది. నిధులు రాగానే పనులు పూర్తి చేస్తాం. అదనపు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు కావాలంటూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. సందర్శకుల సంరక్షణ విషయంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. నగరవనంలో అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటాం.

- పట్టాభి, ఎఫ్‌ఆర్వో

చిత్తూరు సింగిల్ విండోకు అఫిషియల్ ఇన్‌చార్జి కమిటీ నియామకం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు సహకార వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం(సింగిల్‌విండో)కు ప్రభుత్వం ఇది వరకు నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమించింది. ఛైర్మన్‌గా బీఎస్ రాజసింహులు, డైరెక్టర్లుగా వెంకటేశ్వర నాయుడు, మోహన్‌లను నియమించింది. కాగా తాజాగా వారి స్థానంలో అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి చిత్తూరు సబ్ డివిజన్ సహకార అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. ఈ కమిటీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి 2026 జనవరి 30వ తేదీవరకు కొనసాగుతారని పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో సమాచార హక్కు చట్టం కమిషనర్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.



సునీల్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

కందిపప్పు కోసం ఎదురుచూపులే..!

- రేషన్‌కార్డుదారులకు తప్పని నిరాశ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏ నెలకానెల కందిపప్పు కోసం ఎదురుచూడటం.. రాలేదని తెలిసి నిరాశ చెందడం రేషన్‌కార్డుదారులకు తప్పడం లేదు. ఈనెలలోనూ బియ్యం, పంచదారతోనే విజయదశమి పండుగ ముగించగా, మరో 20 రోజుల్లో దీపావళి పండుగ కూడా రానుంది. రెండు పెద్ద పండుగలు ఇదే నెలలో వచ్చినా రేషన్‌కార్డుదారులకు కందిపప్పు అందని పరిస్థితి నెలకొంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కందిపప్పు సరఫరా ఆగిపోయింది.

బొమ్మయ్యపల్లె సర్పంచ్‌ను దెబ్బతీసే కుట్ర

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనను అడ్డుపెట్టుకుని బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్యను దెబ్బతీయడానికి కుట్ర చేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఆదివారం పుత్తూరులోని తన నివాసంలో జీడీనెల్లూరు వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి, పార్టీ లీగల్ సెల్ నాయకులు సూర్యప్రకాశ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. గోవిందయ్యకు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు, క్వారీ ఉందని.. దీనివల్ల అతడి ఆర్థిక వనరులను దెబ్బతీయడానికి కుట్ర జరుగుతోందని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చేసి రాజకీయం చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. జరిగిన ఘటనపై నిజానిజాలను పోలీసులు నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు.

డైట్‌లో అ'పూర్వ' కలయిక



డైట్‌లో అధ్యాపకులకు సన్మానం

వెదురుకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో 1985-86వ సంవత్సరం టీచర్ ట్రైనింగ్ కోర్సు చదివిన వారంతా 39 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. డైట్‌లో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. రూ.6లక్షల విరాళంతో నిర్మించిన కళావేదికను డైట్‌కు అంకితం చేశారు. ఈ నేపథ్యంలో డైట్ అధ్యాపకులను సన్మానించారు. అంతకుముందు తమ బ్యాచ్‌లోనివారు, అధ్యాపకుల్లో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు.



కళావేదికను ప్రారంభిస్తున్న డైట్ అధ్యాపకుడు

నేడు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ

● కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కింద జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఆరు, జిల్లా స్థాయిలో 48 అవార్డులు దక్కాయని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశుభ్రత రంగంలో విశిష్టమైన సేవలందించిన అధికారులు, శానిటరీ వారియర్స్, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీలు, మునిసిపాలిటీ, ప్రభుత్వ కార్యాలయాలకు అవార్డులు లభించాయన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులను సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా కుప్పం, పలమనేరు మునిసిపల్ కమిషనర్లు, శాంతిపురం మండలం కెనమాకులపల్లె గ్రామ పంచాయితీ సర్పంచ్, ఐరాల మండలం కామినాయని పల్లె అంగన్వాడీ కార్యకర్త, కుప్పం కడా అధికారి, చిత్తూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ అధికారులు అవార్డులు అందుకోనున్నారని వివరించారు. జిల్లా స్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వచ్ఛాంధ్ర అవార్డులు సాధించిన 48 మంది వ్యక్తులు, సంస్థల ప్రతినిధులను సన్మానించి, అవార్డులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎంపీ, శాసనమండలి, శాసనసభ సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

రేపు చలో విజయవాడను విజయవంతం చేయండి: ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఉద్యోగ సంఘాలను కనీసం చర్చలకు పిలువలేదన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. అందువల్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, ఉపాధ్యక్షుడు చంద్రన్, నాయకులు డిల్లీ ప్రకాష్, గుణశేఖర్, బాలచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, కమలాపతి, తదితరులు పాల్గొన్నారు.

గిడిగి జలపాతంలోపడి ఒకరి మృతి

వి.కోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాలుజారి జలపాతంలోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వి.కోట మండలం చిన్నాగనపల్లెకు చెందిన శ్రీనివాసులు (42) శాంతిపురంలోని హోటల్‌లో పనిచేసుకుంటున్నాడు. శనివారం సాయంత్రం సహచరులతో కలిసి వి.కోట మండలంలోని గిడిగి జలపాతానికి చేరుకున్నాడు. జలపాతం వద్ద శ్రీనివాసులు కాలుజారి పడటంతో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అతడిని కాపాడేందుకు సహచరులకు సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న సీఐ సోమశేఖర్ ఆదివారం ఉదయం సిబ్బందితో జలపాతం వద్దకు చేరుకొని పరిశీలించారు. పలమనేరు అగ్నిమాపక సిబ్బంది సాయంతో అతి కష్టంపై మృతదేహాన్ని బయటకుతీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలపాతం వద్ద నీటి ఉధృతి అధికంగా ఉందని.. పర్యాటకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు.



జలపాతం నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, మృతి చెందిన శ్రీనివాసులు

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

చౌడేపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు (ఇన్‌సెట్లో) గంగమ్మ

రెండు బైకుల ఢీ

- ఇద్దరు యువకుల దుర్మరణం
- ఒకరికి గాయాలు



సాయికిరణ్, యుగంధర్ (ఫైల్‌ఫొటోలు)



సంఘటన స్థలంలో యువకుల మృతదేహాలు

వెదురుకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, ఒకరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలంలోని కొమరుగుంట గ్రామ పంచాయతీ సామిరెడ్డికండ్రిగకు చెందిన యుగంధర్(19) బైక్‌లో స్వగ్రామం నుంచి పచ్చికాపల్లం మీదుగా ఆదివారం తిరుపతికి వెళ్తున్నాడు. అదే సమయంలో తిరుపతి జిల్లా దుర్గసముద్రం వద్ద వడ్డిఇండ్లుకు చెందిన సాయికిరణ్(23) తన స్నేహితుడితో కలసి బైక్‌లో తిరుపతి వైపు నుంచి పచ్చికాపల్లంకు వస్తున్నాడు. సాయంత్రం బొమ్మనదొడ్ల క్రాస్ రోడ్డు వద్దకొచ్చేసరికి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు నడుపుతున్న సాయికిరణ్(23), యుగంధర్(19)లు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌లో వెనుక వైపు ఉన్న తేజ(17) గాయపడటంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. తేజ స్వగ్రామం వివరాలు తెలియలేదు. మృతులకు వివాహం జరగలేదని సమాచారం. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గాయపడ్డ తేజ

తిరుపతిలో నీలిట్ కేంద్రం

● వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక సంస్థ (నీలిట్) కేంద్రం ప్రారంభమైంది. ఎస్వీ యూనివర్సిటీలో ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన తాత్కాలిక కేంద్రాన్ని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఎంపీ గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, ఎస్వీయూ వీసీ అప్పారావు తదితరులు స్థానికంగా హాజరయ్యారు. ఈ కేంద్రం ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించేందుకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆధునిక ఐటీ, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. సమాచార సాంకేతికత (ఐటీ), వెబ్ డిజైనింగ్, పీసీ హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్, ఆఫీస్ ఆటోమేషన్, అకౌంటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

సమష్టి కృషితోనే పలమనేరుకు 'స్వచ్ఛాంధ్ర' అవార్డు







కంపోస్టు యార్డులో చెత్తను సెగ్రిగేషన్ చేస్తున్న భారీ యంత్రాలు, తయారైన ఎరువు, సెప్టిక్ ట్యాంక్‌ల మురుగును శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్

పలమనేరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరును పేదల ఊటీగా పిలుస్తారు. పలమనేరు మున్సిపాలిటీగానే కాకుండా నియోజకవర్గ కేంద్రంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగాను, మిల్క్, సిల్క్ టౌన్‌గా పేరుంది. మున్సిపల్ పరిధిలో 60వేలకుపైగా జనాభా ఉండగా.. దాదాపు 16వేల ఇళ్లు ఉన్నాయి. పారిశుధ్యంలో ఎప్పటినుంచో ఆదర్శంగా ఉన్న మున్సిపాలిటీ నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక వెనుక సమష్టి కృషి దాగుంది. మున్సిపాలిటీలోని 26 వార్డుల నుంచి రోజూ 17.5 మెట్రిక్ టన్నుల చెత్తను పారిశుధ్య కార్మికులు ఇంటింటా సేకరించి కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. ఇందులో తడి చెత్త 10 మెట్రిక్ టన్నులు, పొడిచెత్త 7.5 మెట్రిక్ టన్నులుగా ఉంటోంది. ఈ చెత్తను తరలించేందుకు 42 తోపుడు బండ్లు, మూడు ట్రాక్టర్లు, రెండు కంపాక్టర్లు వినియోగిస్తున్నారు. కమిషనర్ రమణారెడ్డి ఉదయాన్నే వీధుల్లో పారిశుధ్యంపై తనిఖీలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కాలువల్లో మురుగును తొలగిస్తున్నారు. కంపోస్టు యార్డులో గతనెల దాదాపు 15వేల మెట్రిక్ టన్నుల చెత్తను ఎరువుగా తయారు చేశారు.

సెప్టిక్ ట్యాంక్‌ల మురుగు కోసం ప్రత్యేక ప్లాంట్

సెప్టిక్ ట్యాంకుల మురుగును గతంలో పలమనేరు సమీపంలోని అటవీప్రాంతాల్లో పడేసేవారు. ఐదేళ్ల క్రితం పలమనేరు కంపోస్టుయార్డు వద్ద ఎఫ్ఎస్‌టీపీ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటుకు సెప్టిక్ ట్యాంక్‌ల మురుగును తరలించి ట్రీట్‌మెంట్‌చేసి ఎరువుగా తయారు చేస్తున్నారు.

ప్లాస్టిక్ రహితంగా..

పలమనేరులో ప్లాస్టిక్ కవర్లను నిషేధించేందుకు మున్సిపల్ అధికారులు తీవ్రంగా కృషిచేస్తున్నారు. తరచూ పట్టణంలోని దుకాణాలు, మాంసం దుకాణాలు, బేకరీలు, కూరగాయల మార్కెట్లలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది తనిఖీలు చేసి, జరిమానాలు కూడా విధిస్తున్నారు. దీనివల్ల ప్రస్తుతం పలమనేరులో ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గుముఖం పట్టింది. అలాగే నూలు సంచులు వినియోగించాలని ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు మెప్మా నుంచి చేతి సంచులు, నారసంచులు తయారు చేయించి సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణ సమతుల్యత కోసం విస్తృతంగా మొక్కలు నాటుతున్నారు.

అందరి సహకారంతోనే...



అందరి సహకారంతోనే పలమనేరు మున్సిపాలిటీ నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైంది. దీనివెనుక పారిశుధ్య కార్మికులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది సమష్టి కృషి ఉంది. ఈ అవార్డు లభించడం మరింత బాధ్యతను పెంచింది.

- ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు

'గురుతేజం జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం



పలమనేరు బాలాజీని, కొత్తపల్లి పాపయ్యను సన్మానిస్తున్న సీఐ నిత్యబాబు, శ్రీధర్‌రెడ్డి, యూవీ రత్నం తదితరులు

చిత్తూరు అర్బన్/చిత్తూరు సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఉపోదయ ఫౌండేషన్, ఎంపీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుతేజం జీవిత సాఫల్య పురస్కారాన్ని పలువురికి ప్రదానం చేశారు. సాహితీ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్న ప్రముఖ రచయిత, పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీకి, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొత్తపల్లి పాపయ్యకు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, దాసరి ఉషారాణి, శ్రీధర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు ఈ పురస్కారాన్ని అందజేసి, సన్మానించారు. కథ, కవిత, నవల, విమర్శ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు పొందిన పలమనేరు బాలాజీ నాలుగు కథా సంపుటాలను, మూడు కవితా సంపుటాలను, నవలను వెలువరించారు. సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలమనేరు బాలాజీ, కొత్తపల్లి పాపయ్యకు పలువురు అభినందనలు తెలిపారు.



టీడీపీ కార్యాలయానికి కంప్యూటర్ వితరణ

బంగారుపాళ్యం(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల టీడీపీ కార్యాలయానికి మండల ఐటీ సెల్ అధ్యక్షుడు, కొత్తపల్లెకు చెందిన దొరబాబు రూ.40 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా కంప్యూటర్‌ను ప్రారంభించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

● ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యనందించి ఉత్తమ విద్యార్థులను దేశానికి అందించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ సంఘంలో ఉపాధ్యాయులది ఉన్నత స్థానమని, సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, ఎంఈవో హేమలత, నాయకులు గాలి దిలీప్, ప్రదీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న ధర్నా ఆదివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శిరీష మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపై పని ఒత్తిడి బాగా పెరిగిపోయిందన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రమోషన్లు ప్రభుత్వం ఇవ్వడం లేదని విమర్శించారు. తమ సమస్యలపై అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేదని, అందుకే గత 5 రోజులుగా జిల్లా వ్యాప్తంగా సమ్మె చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో కూడా పీహెచ్‌సీ వైద్యులు ప్రాణం పెట్టి రోగుల ప్రాణాలను కాపాడామని, ఇప్పుడు తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడండి

● ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

బంగారుపాళ్యం, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): సర్వీసు రోడ్డులేక తమ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్ర ప్రాణనష్టం జరుగుతోందని తంబుగానిపల్లె, బీకాపురపల్లె, జిల్లేడుపల్లె, మంగళపల్లె, కల్లూరుపల్లె పరిసర గ్రామస్తులు ఆదివారం బంగారుపాళ్యం పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. తంబుగానిపల్లెకు చెందిన మోహన్ నాయుడు మాట్లాడుతూ హైవేకి పక్కనే సర్వీసు రోడ్డు లేనందున కేజీ సత్రం నుంచి తంబుగానిపల్లెకు వెళ్లే మార్గంలో ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 75 ప్రమాదాలు జరగ్గా ఇందులో 32 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇదివరకే కలెక్టర్, మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. ప్రమాదాల నివారణకు త్వరగా చర్యలు తీసుకుని సర్వీసు రోడ్డును ఏర్పాటుచేయాలని రవి, లోకేష్, తిరుమలయ్య నాయుడితో పాటు పలువురు గ్రామస్తులు కోరారు.

ఎన్‌హెచ్‌ఏఐపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

పలుమార్లు వినతి చేసినా హైవే అధికారులు పట్టించుకోకపోవడంపై ఎన్‌హెచ్‌ఏఐపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. నిత్యం ప్రమాదాలు జరుగుతూ అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారని, వెంటనే హైవే అధికారులు చర్యలు చేపట్టి కేజీ సత్రం వద్ద నుంచి తంబుగానిపల్లెకు వెళ్లేందుకు సర్వీసు రోడ్డు చేపట్టాలని ఎమ్మెల్యే హైవే అధికారులకు సూచించారు.

చిత్తపార పాఠశాలకు బీరువా వితరణ



గుడిపాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపార ప్రాథమిక పాఠశాలకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తరఫున టీడీపీ నాయకులు శరత్, రాజేష్, గోవిందగౌడ్, రమేష్, నాగరాజ్, గిరిబు పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కు బీరువాను అందించారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు



కోతకు గురైన తారు రోడ్డు

గుడిపాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు తారు రోడ్లు కోతకు గురయ్యాయి. నరహరిపేట క్రాస్ నుంచి రెట్టగుంట, కృష్ణజమ్మపురం, కండిగ, కుప్పిగానిపల్లె, బీలాపల్లె క్రాస్ నుంచి పేయనపల్లె, పాపిశెట్టిపల్లె, ముక్కావారిపల్లె, బండపల్లె, చిత్తపార గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా కోసుకుపోయింది. దీంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గాల్లో ప్రయాణించడానికి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్ర

భవన నిర్మాణం



గుడిపాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్‌పురం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం కొన్ని సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండడంతో ఇటు వైద్య సిబ్బంది, అటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సబ్ సెంటర్ భవన నిర్మాణాన్ని ప్రారంభించినా పనులు పూర్తిగా నిర్వహించకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం పడ్డ కురిసినప్పుడు రోగులకు వైద్య సేవలు అందించడానికి వైద్యాధికారులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ సబ్‌సెంటర్ భవనానికి తలుపులు, కిటికీలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తరచూ మొరాయిస్తున్న

ఆర్టీసీ డొక్కు బస్సులు



పిటుగానిపల్లె వద్ద ఆగిపోయిన చిత్తూరు-బలిజకండ్రిగ ఆర్టీసీ బస్సు

పాలసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-బలిజకండ్రిగ మార్గంలో వయా పాలసముద్రం మండలం మీదుగా నడిచే చిత్తూరు-2 డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు బలిజకండ్రిగలో బయలుదేరిన ఆర్టీసీ బస్సు పిటుకురుపల్లె వద్ద మరమ్మతులకు గురై ఆగిపోయింది. దీంతో చిత్తూరు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడి మరో రెండు గంటల అనంతరం వచ్చిన ఆర్టీసీ బస్సులో గమ్యస్థానానికి చేరుకోవలసి వచ్చింది. గంగాధరనెల్లూరు నుంచి బలిజకండ్రిగ వరకు ఓ వైపు అధ్వానంగా ఉన్న తారురోడ్డుతో పాటు తరచూ మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకుని ఈ మార్గంలో మంచి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

కోడిపందెం స్థావరంపై దాడి

పది మంది అరెస్టు

పెనుమూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విడిదిపల్లె గ్రామ సమీపంలో కోడి పందెం ఆడుతున్న స్థావరాలపై ఆదివారం పెనుమూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటనరసింహులు తెలిపిన వివరాల మేరకు.. విడిదిపల్లె సమీపంలోని అడవిలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి, పది మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి 4 కోళ్లు, 5 కత్తులు, 5 ద్విచక్ర వాహనాలు, రూ.15,100 నగదు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సుమారు 20 మందికిపైగా తప్పించుకున్నట్లు సమాచారం.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బంగారుపాళ్యం, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన శ్రీనివాసన్, వాసంతి దంపతుల కుమార్తె బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆదివారం ఉదయం నుంచి తన కుమార్తె కనిపించలేదని తల్లి వాసంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

12న ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

చిత్తూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నికలు ఈ నెల 12వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని ఎన్నికల అధికారి మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలకు స్టేట్‌బాడీ తరఫున ఎల్. పెంచలయ్య, మల్లేశ్వరరెడ్డిలు పరిశీలకులుగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా శాఖ, అన్ని సమితులకు సంబంధించిన సభ్యులందరూ తప్పక హాజరై, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

పార్వతీపురంలో చోరీ

సోమల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతీపురానికి చెందిన రాజమ్మ ఆదివారం ఇంటికి తాళం వేసి ఉపాధి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చారు. తాళాలు తీయగా గుర్తు తెలియని దుండగులు బీరువాలోని నగలు, నగదును ఎత్తుకెళ్లారని గుర్తించి సోమల పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజమ్మ ఇంటి వెనుక కిటికీ ద్వారం చేసి దుండగులు లోపలకు ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ శివశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన నగదు, బంగారం వివరాలు తెలియాల్సి ఉంది.

పేరుకే కార్పొరేషన్‌లో విలీనం.. అభివృద్ధి మృగ్యం

● కనీస వసతులకు నోచుకోని విలీన పంచాయతీలు



గోపాలపురంలో మట్టిరోడ్డు - చెట్లూచెదారంతో నిండిన బోసులకాలనీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పుష్కరకాలం కిందట నగరశివారులోని 14 గ్రామ పంచాయతీలను చిత్తూరు నగరపాలక సంస్థలో విలీనం చేశారు. పేరుకే నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నప్పటికీ ఆయా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కనీస సదుపాయాలను గాలికొదిలేసిన అధికార యంత్రాంగం నగరం నడిబొడ్డున వార్డులపైనే దృష్టిపెట్టింది. నగరపాలక సంస్థకు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తగిన సదుపాయాలను కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ పాలనలోనూ సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ, కమ్యూనిటీ భవనం, సీటీమ్యాకుల నిర్మాణం చేపట్టకపోవడం గమనార్హం. 11వ డివిజన్‌లోని చెరువు ముందరపురం, యానాది కాలనీలో ఎగుడు దిగుడుగా ఉన్న మట్టిరోడ్లలోనే ప్రయాణించాల్సి ఉంది. పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరణ కోసం ఈ ప్రాంతాల వైపు రావడమే మానేశారని కాలనీ వాసులు చెబుతున్నారు. నివాసాల పక్కనే ముడుగుకుల్లు కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమ కాటు కారణంగా పిల్లలకు జ్వరాలు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 12వ డివిజన్‌లోని కన్నికాపురంలో పారిశుధ్యలోపం, శ్రీలంక కాలనీలో డ్రైనేజీ కాలువ లేక కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఉన్నప్పటికీ అలంకార ప్రాయమేనని వారు పేర్కొంటున్నారు.

● 11వ డివిజన్‌లో జోగులకాలనీ, బండపల్లె రోడ్డు, సీజీవల్లి, ఎస్ఎస్ కండ్రిగ, బండపల్లె, గోవిందపురం, పందిరిపురం, యాదవపురం, ఎబీవీ పురం, ఏపీడబ్ల్యూ, యానాదికాలనీ, చెరువు ముందు కాలనీలు ఉన్నాయి.

● 12వ డివిజన్‌లో సంగిపల్లె దళితవాడ, యానాదికాలనీ, ద్వారకాపురం, కన్నికాపురం, గోపాలపురం, 190రామాపురం, అయల్‌పురం, లక్ష్మీపురం, శ్రీలంక కాలనీ, గంగాసాగరం ఉన్నాయి.

ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఈనెల 15 కల్లా మామిడి రైతులకు సబ్సిడీ డబ్బులు జమ చేస్తాం

● ఎమ్మెల్యే మురళీమోహన్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు, రైతులు

బంగారుపాళ్యం, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఆదివారం బంగారుపాళ్యం మామిడికాయల మార్కెట్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రైతులు, ఆటో డ్రైవర్లతో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు, రైతులకు ఎంతో మేలు చేకూరిందని, తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ప్రజలకు అర్థమయ్యేలా ప్లకార్డులు ప్రదర్శించి తగ్గిన జీఎస్టీ గురించి వివరించారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు ఆటోవాలాలకు రూ.15 వేలు వారి ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. ఈనెల 15వ తేదీకల్లా మామిడి రైతుల ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు హేమచంద్ర నాయుడు, మండల రైతు సంఘ నాయకుడు గజపతి, నాయకులు కమలనాథరెడ్డి, జనార్దన్‌గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ నాయుడు, రాధాకృష్ణ, రమేష్, టీకే హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నందనవనంలా

బీరప్పచెరువు జడ్పీ హైస్కూల్

● పాఠశాలకు స్వచ్ఛతాహి పురస్కారం



శుభ్రంగా ఉన్న బీరప్పచెరువు జడ్పీ హైస్కూల్



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఐరాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బీరప్పచెరువు జడ్పీ హైస్కూల్ నందనవనంలా ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యుల సహకారంతో పాఠశాలను పచ్చదనం, పరిశుభ్రతతో నడుపుతున్నారు. మండల కేంద్రమైన ఐరాలకు సుమారు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న బీరప్పచెరువు జడ్పీ హైస్కూల్‌కు పరిసర గ్రామాల నుంచి 60 మంది విద్యార్థులు ప్రతి రోజు వెళ్లి విద్యా బుద్ధులు నేర్చుకుంటున్నారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు విచ్చేసేటప్పుడు పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచేలా తరగతుల వారీగా పని చేస్తున్నారు. హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ పాళ్యం సురేశ్‌తో పాటు స్థానికుల సహకారంతో ఆటస్థలం, పచ్చదనం, టాయిలెట్ల సంరక్షణను ఆదర్శంగా నిర్వహించడంతో ఈ పాఠశాల స్వచ్ఛతాహి పురస్కారానికి ఎంపికైంది. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిచేస్తే పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని ఎస్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్వచ్ఛతాహి పురస్కారం రావడం ఆనందంగా ఉంది



బీరప్పచెరువు జడ్పీ హైస్కూల్‌కు స్వచ్ఛతాహి పురస్కారం లభించడం చాలా ఆనందంగా ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఘనత సాధించాం. అందరి ప్రోత్సాహంతో పాఠశాలను మరింత అభివృద్ధి పరుస్తాం. - హెచ్ఎం ఉషారాణి

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌లు

● నెలల తరబడి పట్టించుకోని అధికారులు



మ్యాన్‌హోల్‌కు అడ్డుపెట్టిన ఇటుకలు, రేకులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని మిట్టూరు ఎంఎస్‌ఆర్ థియేటర్ పక్క వీధిలో మ్యాన్‌హోల్‌లు ప్రమాదకరంగా మారాయి. మిట్టూరుప్రాంతానికి ఈ మార్గం దగ్గర కావడంతో రాత్రి, పగలు తేడా లేకుండా స్థానికులు ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డుపై రెండు మ్యాన్‌హోల్‌లు తుప్పుపట్టి విరిగిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. నెలలు గడుస్తున్నా కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు వాహనదారులు మ్యాన్‌హోల్‌లో పడి ఆసుపత్రుల పాలయ్యారని వాపోతున్నారు. చేసేది లేక స్థానికులే ప్రమాదం జరగకుండా ఉండేందుకు రేకుపెట్టి అడ్డంగా పెట్టారు. మరో హోల్‌కు రెండు వైపులా ఇటుకలు అడ్డుపెట్టారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కలిగిరికొండ తారురోడ్డుకు మోక్షమెప్పుడు..?

● ఇబ్బంది పడుతున్న భక్తులు



కంకర తేలిపోయిన కలిగిరికొండ ఆలయ రోడ్డు

పూతలపట్టు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు - పెనుమూరు మండలాల పరిధిలోని కలిగిరికొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి తారురోడ్డు లేక భక్తులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. పూతలపట్టు, ఓమ్మేపల్లె, బందమీద పల్లి మీదుగా కలిగిరికొండకు వందలాదిమంది భక్తులు నిత్యం వెళుతుంటారు. ఈ మార్గంలో సరైన రోడ్డు వసతి లేదు. బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో మార్గాన్ని ఎక్స్‌కవేటర్ పెట్టి శుభ్రం చేస్తారు. వర్షం కురిసిందే తడవుగా మట్టిరోడ్డంతా బురదమయంగా మారిపోతుంది. పెనుమూరు నుంచి ఆలయానికి తారురోడ్డు ఏర్పాటు చేశారు. పూతలపట్టు నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ఎందుకు తారురోడ్డు వేయడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

గోతులు పూడ్చరూ....



తిరుపతి-చెన్నై రహదారి నింద్ర క్రాస్ సమీపంలో గోతులు

నింద్ర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై జాతీయ రహదారి నింద్ర క్రాస్ పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపై గోతులు ప్రమాదకరంగా మారాయి. ఆదమరచి వాహనం నడిపినా, రాత్రి సమయంలో కనిపించక గోతుల్లో ద్విచక్ర వాహనాలు, చిన్నపాటి వాహనాలు దిగబడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీనికి తోడు ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నీరు నిలిచి గోతులను కనబడక వాహనాలు దిగబడి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ రహదారిలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వెళుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న గోతులను పూడ్చాలని ప్రయాణికులు, వాహన దారులు కోరుతున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ, గంగమ్మ ఆలయాల కుంభాభిషేకం



అలంకారంలో ముత్యాలమ్మ, గంగమ్మ ఉత్సవమూర్తులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసార్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ, గంగమ్మ ఆలయాల కుంభాభిషేక వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేదపండితులు శాస్త్రోక్తంగా అమ్మవార్ల మూలవిరాట్ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేసి కుంభాభిషేకం చేపట్టారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్తులు అన్నదానం ఏర్పాటుచేశారు.

కార్మికుల పక్షాన టీడీపీ

● గౌనివారి

రామకుప్పం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి కార్మికుల పక్షాన నిలుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే గౌనివారి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బాటలోనే సీఎం చంద్రబాబు పయనిస్తూ కార్మికులకు అండగా నిలుస్తున్నారన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున రూ.435 కోట్లు అందజేసిందన్నారు. జగన్ తన పాలనలో అరకొర సాయం అందించి డీజిల్, పెట్రోలు ధరలు అమాంతం పెంచి ఆటోడ్రైవర్ల జేబులకు చిల్లు పెట్టారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10 వేలు అందిస్తే తమ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రూ.1400 కోట్లు వెచ్చించి రహదారులకు మరమ్మతులు చేయించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుండడంతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.